
సాక్షి
బాపట్ల
సోమవారం । 22 । మే । 2023




కార్మెల్‌మాతకు పూజలు

ఫిరంగిపురం: కార్మెల్ మాతను దర్శించుకునేందుకు గుంతకల్లు, ధర్మవరం, పొద్దుటూరు, మార్కాపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 521.00 అడుగుల వద్ద ఉంది. ఇది 151.1053 టీఎంసీలకు సమానంగా ఉంది.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో ఎంపీ మోపిదేవి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు దంపతులు ఆదివారం దర్శించుకున్నా రు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎంపీకి అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఎంపీకి బహూకరించారు.

భూములపై విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: దళితులకు, దేవదాయశాఖకు మధ్య ఏర్పడిన భూముల వివాదంలో విచారణాధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను నియమించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఆదేశాలు ఇచ్చారు. 2008వ సంవత్సరంలో పులిచింతల ప్రాజెక్ట్ నిర్మాణ సందర్భంగా దాచేపల్లి మండలం ఏలియన్‌పేటకు చెందిన వారు భూములు కోల్పోయారు. నిర్వాసితులైన సుమారు 77 మంది దళితులకు పునరావాసం కింద ఇచ్చిన భూముల విషయంలో దేవదాయ శాఖకు సంబంధించిన భూములుగా ఘర్షణలు తలెత్తటంపై ప్రచురితమైన వార్త కథనాలపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. విచారణ సమయంలో ఇరువర్గాల వారు ఘర్షణలకు తావివ్వకుండా సహకరించి సమస్యను పరిష్కరించే విధంగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

నేడు ప్లస్ టూ స్కూళ్లలో మిగిలిన పోస్టులకు కౌన్సెలింగ్

తెలుగు సబ్జెక్టులో 25 పోస్టుల భర్తీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్లస్ టూ తరగతుల బోధనకు రెండు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భర్తీ కాగా, మిగిలిన పోస్టుల భర్తీకై సోమవారం గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ జరగనుంది. ఆదివారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ తెలుగు సబ్జెక్టులో ఖాళీలుగా చూపిన 25 పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో రీ-డిప్లాయిమెంట్ పద్ధతిపై భర్తీ చేశారు. కాగా ఇంగ్లిష్, సివిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుతో పాటు ఫిజిక్స్-4, కెమిస్ట్రీ-మూడు, జువాలజీ-మూడు, ఎకనామిక్స్-రెండు, కామర్స్‌లో మూడు చొప్పున పోస్టులను భర్తీ చేసేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో హాజరు కావాలని డీఈఓ పి.శైలజ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గుంటూరు డీవైఈఓ కె. సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సీనియర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఇండియాస్ ఆర్కిటెక్చరల్ హెరిటేజ్ పుస్తకం ఆవిష్కరణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారతదేశ చారిత్రక వైభవాన్ని తెలియజేస్తూ అద్భుతమైన చారిత్రక ఫొటోలతో పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు, చారిత్రక అన్వేషకుడు కేఎస్ వసిఫ్ రూపొందించిన 'ఇండియాస్ ఆర్కిటెక్చరల్ హెరిటేజ్' అనే పుస్తకాన్ని ఇంతియాజ్ ఆవిష్కరించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ మహత్తర వారసత్వ కళా సంపదను రచయిత పుస్తక రూపంలో కళ్లకు కట్టినట్లు చూపారన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు జి.నారాయణరావు మాట్లాడారు. కార్యక్రమంలో పుస్తక రచయిత వసిఫ్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు టి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక స్వర్గధామం

మినీ గోవాగా చీరాల తీరం

- ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన
- వాడరేవు – పిడుగురాళ్ల నేషనల్ హైవే మంజూరు
- పెద్ద ఎత్తున రిసార్టులు
- వాడరేవు నుంచి పొట్టి సుబ్బయ్యపాలెం వరకు బోటింగ్



వాడరేవు తీరం వద్ద గల రిసార్ట్స్

చీరాల: సాగర తీరం ఇక మినీ గోవాగా కాబోతోంది. అందమైన తీరం.. ఇసుక దిబ్బలు.. షూటింగ్ ఇలా వాడరేవు తీరం జెట్ స్పీడ్‌తో అభివృద్ధిలో పరుగెడుతోంది. వారాంతపు సెలవుల్లో ఎక్కువ మంది పర్యాటకులు ఆహ్లాదకరంగా గడిపేందుకు గోవాను ఎంచుకుంటారు. అయితే కొంతకాలం నుంచి అందుకు భిన్నంగా వివిధ ప్రాంతాల నుంచి చీరాల, బాపట్ల తీరాలకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. పెద్ద సంఖ్యలో అన్నీ ఆధునిక హంగులతో రిసార్టులు ఉన్నప్పటికీ తీర ప్రాంత రిసార్టుల్లో రూములు దొరకడం కష్టంగా ఉంటుందంటే పర్యాటకుల తాకిడిని అర్థం చేసుకోవచ్చు. రూమ్ దొరకాలంటే పెద్దఎత్తున సిఫార్సులు చేయాల్సిన పరిస్థితి. దీంతో పాటు తీరం ఒడ్డునే స్థిర నివాసం ఉండేందుకు రాజకీయ నాయకులు, వ్యాపారులు, సినీ హీరోలు, ఎన్‌ఆర్‌ఐలు విల్లాలు కొనుగోలు చేశారంటే తీరప్రాంతం ఎంత అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. వాడరేవు నుంచి పొట్టి సుబ్బయ్యపాలెం వరకు పేరెన్నికగలిగిన, చిన్నపాటి రిసార్టులు 50వరకు ఉన్నాయి. ఇటీవల ప్రైవేటు రిసార్ట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన పర్యాటక మంత్రి ఆర్కే రోజా బాపట్ల జిల్లాలో తీరప్రాంతం పర్యాటక రంగానికి అత్యంత అనుకూలంగా ఉందని, ప్రభుత్వ స్థలాలు గుర్తించి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రిసార్టులు నెలకొల్పి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

హార్బర్‌తో తీరప్రాంతంలో ఆర్థికాభివృద్ధి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సాగర్ మాల ఫేజ్-2లో భాగంగా రూ.417.55 కోట్లతో టెండర్లకు ఆహ్వానించగా మ్యారీ టైప్ బోట్ ప్రాజెక్టు ఏజెన్సీ వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి టెండర్లు దక్కించుకుంది. ప్రస్తుతం 52 ఎకరాలు అవసరం ఉండగా 15.67 ఎకరాల వరకు స్థలాన్ని రెవెన్యూ శాఖ అప్పగించింది. మరో 35.77 ఎకరాలు ప్రతిపాదనలో ఉన్నాయి. మిగిలిన భూమిని కూడా భూసేకరణ ద్వారా తీసుకుని నెలల వ్యవధిలో హార్బర్ పనులు పూర్తి చేసేందుకు మత్స్యశాఖ అధికారులు చేపట్టారు.

టూరిస్టు పోలీస్‌స్టేషన్..

జిల్లాలో తీర ప్రాంత పరిధిలో పర్యాటకుల భద్రత కోసం పోలీస్ పోస్టులను బాపట్లలోని సూర్యలంక, చీరాల నియోజకవర్గంలో రామాపురం, కఠారివారిపాలెం, వాడరేవు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటు చేసే అవుట్‌పోస్టుల్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా జాకెట్లు, సామాగ్రి, మైకు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

నేషనల్ హైవేతో పర్యాటక రంగానికి ఊపు..

వాడరేవు – పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఆమోదముద్ర వేసి రూ.880 కోట్లు మంజూరు చేసింది.

దీంతో రోడ్డు నిర్మాణ పనులకు అవసరమైన ప్రక్రియను అధికారులు చేపట్టారు. వాడరేవు నుంచి ఈపూరుపాలెం మీదుగా కారంచేడు-పర్చూరు మధ్య 18వ కిలోమీటరు వరకు పూర్తిగా కొత్త రహదారిని నిర్మించి అక్కడి నుంచి ప్రస్తుతం ఉన్న రహదారిని విస్తరించేలా భూసేకరణ ప్రకటన జారీ చేశారు. పర్చూరు నియోజకవర్గంలోని గర్నెపూడి, అన్నంభొట్లవారిపాలెం వద్ద మరో 10 హెక్టార్లకు ప్రకటన జారీ కావాల్సి ఉంది. ముందుగా చిలకలూరిపేట నుంచి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో నకరికల్లు వరకు నాలుగు లైన్లుగా, వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రెండు లైన్లుగా విస్తరించనున్నారు.

వస్త్ర వ్యాపారం వృద్ధి..

చినబొంబాయిగా పేరుగాంచిన చీరాల్లో వస్త్ర వ్యాపారం కూడా జోరుగా సాగుతుంది. వారాంతపు సెలవులతో పాటు హైదరాబాద్, మహారాష్ట్ర, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు చీరాల వాడరేవు తీరానికి వచ్చి తర్వాత వస్త్రాలు కొనుగోలు చేస్తుండటంతో వస్త్ర వ్యాపారం కూడా బాగా జరుగుతుంది.

చీరాల తీరం మినీ గోవాగా మారుతోంది..



రాష్ట్రంలో తీర ప్రాంతంలో చీరాల అతివేగంగా అభివృద్ధి చెందుతుంది. గత కొన్నేళ్ల నుంచి పర్యాటకులు గణనీయంగా పెరుగుతున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు సెలవు దినాలు, వారాంతపు సెలవుల్లో వాడరేవు, సూర్యలంక బీచ్‌లకు తరలి వస్తున్నారు. దీనికి తోడు హార్బర్‌లతో తీర ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. పర్యాటక రంగం వలన ఎంతో మందికి ఉపాధి కలుగుతుంది. వాడరేవు-పిడుగురాళ్ల హైవే వలన హైదరాబాద్, తెలంగాణ ప్రాంతం నుంచి తీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ప్రయాణం చాలా సులువు అవుతుంది.

– కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే, చీరాల

సముద్రంలో బోటింగ్‌కు అనుమతులు..

సాధారణంగా సముద్రంలో బోటింగ్ చేయాలంటే గోవా వెళ్లాల్సిందే. స్పీడ్ బోట్, బనానా రైడ్, పారాచ్యూట్ రైడ్, వాటర్ స్పోర్ట్స్‌లు గోవాలోనే దొరుకుతాయి. అయితే తీరప్రాంతం అభివృద్ధి చెందడంతో పర్యాటక శాఖ వాడరేవు నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం వరకు ఈ తరహా బోటింగ్, రైడ్‌లు కొద్దినెలల్లోనే వాడరేవుకు రానున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి వాడరేవు తీరానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుండటంతో తీర ప్రాంతంలో వసతులు, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

బాలికపై లైంగికదాడి

తెనాలిరూరల్: చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి 13 ఏళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. మూడు గంటల పాటు తన గదిలోనే ఉంచుకుని అర్ధరాత్రి బాలికను ఇంటికి పంపాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లితోపాటు స్థానిక మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వైకుంఠపురం సమీపంలో గల పోతురాజు కాలనీలో నివసించే రాడ్‌బెండింగ్ కార్మికుడు కొప్పుల రాజు అలియాస్ సోగ్గాడు చెడు అలవాట్లకు బానిసయ్యాడు. మనస్పర్థల కారణంగా ఇతడి భార్య, పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. ఎనిమిదేళ్లుగా కాలనీలో ఒంటరిగా ఉంటున్న రాజు, పిల్లలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, యాచక మహిళలనే టార్గెట్ చేస్తూ తరచూ ఏదో ఒక గలాటా సృష్టిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో 13 ఏళ్ల బాలిక శనివారం రాత్రి 8 గంటల సమయంలో దుకాణానికి వెళ్లి వస్తుండగా, బాలికను పిలిచి డబ్బులు ఇచ్చి సిగరెట్లు, కూల్‌డ్రింక్ తీసుకురమ్మని చెప్పాడు. బాలికనూ రూ.10 ఇచ్చి కొనుక్కోమన్నాడు. తిరిగి దుకాణానికి వెళ్లి వచ్చిన బాలికను తాను ఉండే గదిలోకి తీసుకెళ్లాడు. సుమారు మూడు గంటలపాటు బాలికను గదిలోనే ఉంచిన అతను ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి వేళ ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లిన బాలిక జరిగింది తల్లికి చెప్పింది. స్థానికులతో కలసి రాజు ఉండే గదికి వెళ్లగా అప్పటికే అక్కడ నుంచి జారుకున్నాడు. ఘటనపై బాలిక తల్లిదండ్రుల తోపాటు స్థానికులంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొప్పుల రాజు దగ్గర్లోని ఒక ప్రార్థన మందిరం కింద గదిలోకి తీసుకెళ్లి వేధించి లైంగికదాడి చేశాడని బాలిక తల్లి వాపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి పరిశీలించి వెళ్లారని, బాలికపై దారుణానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లి సహా స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. బాధిత బాలికను పోలీసులు వైద్య పరీక్షల కోసం తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విచారణ పూర్తి

కారంచేడు: సొసైటీ నిధుల అవకతవకలపై అధికారులు విచారణ పూర్తి చేశారు. 2014, 2015, 2016, 2017 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన కారంచేడు సహకార పరపతి సంఘంలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందాయి. 2013–2018 మధ్య కాలంలో కారంచేడు సొసైటీ అధ్యక్షుడిగా యార్లగడ్డ అక్కయ్య చౌదరి విధులు నిర్వహించాడు. ఈ కాలంలో సొసైటీ నిధులు దారి మళ్లాయి. వీటిపై అనేకసార్లు ఉన్నత స్థాయి విచారణలు జరిగా యి. అప్పటి పాలకవర్గంతో పాటు, సిబ్బందిపైన వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో నిధుల దుర్వినియోగంలో అధ్యక్షుడిదే బాధ్యతగా ఉత్తర్వులు వచ్చాయి. సొసైటీ నిధుల నుంచి రూ 26.57 లక్షలు గోల్‌మాల్ జరిగాయని నిర్ధారణ అయింది. సహకార చట్టం 52 ప్రకారం యార్లగడ్డ అక్కయ్యను 2017 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 18 శాతం వడ్డీతో సొసైటీకి చెల్లించేలా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్, బాపట్ల జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ అయిన కే యలమందారావు ఉత్తర్వులు జారీ చేశారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 72 కేంద్రాలు ఏర్పాటు
- ఉదయం జూనియర్, సాయంత్రం సీనియర్ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదు
- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషిద్ధం
- విధి నిర్వహణలో ఉండేవారికి ఐడీ కార్డు తప్పనిసరి
- అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

ఒంగోలు: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం జూనియర్ ఇంటర్, సాయంత్రం సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 72 కేంద్రాలను ఎంపిక చేశారు. జూనియర్ ఇంటర్ పరీక్షలకు 21,219 మంది, సీనియర్ ఇంటర్ పరీక్షలకు 11,012 మంది, మొత్తం 32,231 మంది హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 72 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 72 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 628 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కంభం, పెదదోర్నాల, అర్థవీడు, వై.పాలెంలోని పరీక్ష కేంద్రాలను అత్యంత సున్నితమైన కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక దృష్టిసారించారు. కాపీయింగ్ నిరోధానికి 4 ఫ్లయింగ్ స్క్వాడ్, 4 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు ఆర్‌ఐఓ, డీఈసీ సభ్యులు, హైపవర్ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్, రాష్ట్రస్థాయి ఇంటర్ బోర్డు అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. ట్యూషన్ ఫీజు చెల్లించలేదనే నెపంతో హాల్ టికెట్లు నిరాకరించే ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల గుర్తింపు రద్దు చేస్తామని ఆర్‌ఐఓ సైమన్ విక్టర్ హెచ్చరించారు.

నిఘా నీడలో పరీక్షలు..

పరీక్ష కేంద్రాల్లోని అన్ని గదులకు, ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద, ప్రశ్నపత్రాల బండిల్స్ ఓపెన్ చేసే గది, జవాబు పత్రాలు ప్యాక్ చేసే గది.. ఇలా ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఒంగోలు ఆర్‌ఐఓ కార్యాలయం, విజయవాడలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయానికి సీసీ కెమెరాలను అనుసంధానించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆలస్యంగా వస్తే అనుమతి లేదు..

పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించేది లేదని, ఈ నిబంధనను పక్కాగా అమలు చేస్తామని ఆర్‌ఐఓ స్పష్టం చేశారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు, సీనియర్ విద్యార్థులు మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తను నియమించడంతోపాటు తాగునీరు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని చెప్పారు. పరీక్ష కేంద్రంలో విధుల్లో ఉండే సిబ్బందితో సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్ ఉండటానికి వీల్లేదన్నారు. విధులకు హాజరయ్యే సిబ్బంది ఐడీ కార్డు ధరించాలని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఆటంకం కలిగించాలని యత్నించినా, అక్రమాలకు పాల్పడేందుకు కుట్రపన్నినా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నింటా అగ్రిగామి

- పుడమి పుత్రుల సేవలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
- స్నాతకోత్సవాలకు ముస్తాబైన వ్యవసాయ కళాశాల
- నేటి వేడుకలకు హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



ముస్తాబైన వ్యవసాయ కళాశాల

బాపట్ల: హరిత విప్లవంలో అగ్రగామిగా విరాజిల్లుతున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కొన్ని దశాబ్దాలుగా విశిష్టమైన సేవలు అందిస్తోంది. బాపట్ల వ్యవసాయ కళాశాలలో సోమవారం విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాలు జరగనున్నాయి. 993 మంది విద్యార్థులకు ఈ స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు ప్రదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. హరిత విప్లవంలో అద్భుతమైన వంగడాల రూపకల్పన ద్వారా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పుడమి పుత్రుల సేవలో కీలకమైన పాత్రను పోషిస్తోంది. భారతదేశంలోని 74 విశ్వవిద్యాలయాల్లో ఈ యూనివర్సిటీ టాప్ టెన్‌లో తన స్థాయిని పదిలపరుచుకుంది.

అన్నదాతల సేవలో కీలకపాత్ర...

ఈనెల 22న బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిసారిగా యూనివర్సిటీకి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. అన్నదాతకు వెన్నుదన్నుగా విశ్వవ్యాప్తంగా బాపట్ల విశేషమైన ప్రాచుర్యం సంపాదించింది. ఇక్కడి పరిశోధన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు, రైతులకు గణనీయమైన సేవలు అందిస్తున్నాయి. వ్యవసాయ కళాశాల, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, ఆహార విజ్ఞాన కళాశాలలతో పాటు వరి పరిశోధన స్థానం, ఉప్పునీటి పరిశోధన స్థానం, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ వంటి అనేక పరిశోధన స్థానాలకు బాపట్ల జిల్లా కేంద్ర బిందువుగా ఉంది.

78 వసంతాలు దిగ్విజయంగా పూర్తి..

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోనే కీలకమైన అనేక వ్యవసాయ పరిశోధనలు బాపట్ల ప్రాంతంలో ఉన్నాయి. పుడమికి హరితహారంగా బాపట్లను పేర్కొంటారు. ఎన్నో అద్భుతమైన పరిశోధనలకు ఈ ప్రాంతం ఒక ప్రధాన భూమిక పోషిస్తోంది. అందులో బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రధానమైందిగా పేర్కొనవచ్చన్నారు. 1945 లో ఏర్పాటైన బాపట్ల వ్యవసాయ కళాశాల 78 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. దక్షిణ భారతదేశంలో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు తర్వాత ఏర్పాటైన తొలి కళాశాల బాపట్ల వ్యవసాయ కళాశాలే.

బీపీటీ వంగడం సృష్టికర్త...

విశ్వవ్యాప్తంగా విరాజిల్లుతున్న బీపీటీ వరి వంగడం వర్సిటీ పరిధిలోని వ్యవసాయ కళాశాల సృష్టించినదే.. ఇప్పుడీ రకం వంగడాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో కోటి ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఎందరో ఐఏఎస్, ఐపీఎస్‌లు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, సినీ నటులు, ఉన్నత హోదాల్లో స్థిరపడిన ఎందరో ఇక్కడ చదివినవారు ఉన్నారు. కళాశాల ఆవిర్భావంలో వంద మంది విద్యార్థులు ఉంటే అందులో ఇద్దరు మాత్రమే మహిళలు ఉండేవారు. తాజాగా ఇప్పుడు కళాశాలలో సగానికిపైగా మహిళలే వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్నారు. హరిత విప్లవానికి పెద్దపీట వేసిన ఈ కళాశాల అద్భుతమైన ఫలితాలతో అగ్రగామిగా ముందుకు సాగిపోతోంది.

ఉప్పు రైతును ముంచిన అకాల వర్షం

- 1600 ఎకరాల్లో నీట మునిగిన ఉప్పు కొఠారులు
- అకాల వర్షంతో మరోసారి నష్టపోయిన ఉప్పు రైతు



అకాల వర్షం కారణంగా కరిగిన ఉప్పు కుప్పలు

చినగంజాం: అకాల వర్షం ఉప్పురైతును మరోసారి దెబ్బతీసింది. వేసవి కాలం మండే ఎండలు ఉప్పు సాగుకు అనుకూలం కాగా సాగు ముమ్మరంగా సాగుతున్న ప్రస్తుత తరుణంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం కొఠారులను ముంచేసింది. సుమారు 1600 ఎకరాలు ఉప్పు పంట నీటిలో కరిగి పోయింది. మండలంలోని చినగంజాం, పెదగంజాం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం గ్రామాల పరిధిలోని ఉప్పు కొఠారులు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని భూముల్లో సుమారు 1200 ఎకరాలు, రైతుల సొంత భూముల్లో మరో 400 ఎకరాలు ఉప్పు రైతులు సాగు చేస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది సన్న, చిన్నకారు రైతులు కాగా అప్పులు చేసి తెచ్చిన సొమ్ముతో సాగు చేస్తున్నారు. వీరు ఒక ఎకరాకు 25 నుంచి 30 బస్తాల ఉప్పును పండిస్తారు. శనివారం రాత్రి కురిసిన వానతో సుమారు 1000 ఎకరాల్లో మరో రెండు రోజుల్లో తీసేందుకు సిద్ధం ఉన్న ఎక్కాలపై ఉంచిన ఉప్పు నీట కరిగి పోయింది. సుమారు అరగంటకుపైగా నిరంతరంగా కురిసిన వర్షంతో ఎక్కాల్లో వర్షపు నీరు పూర్తిగా నిండిపోయి ఎక్కాలపై గత వారం రోజులుగా పండించి ఆది, సోమ వారాల్లో తీద్దామనుకున్న ఉప్పు మునిగి కరిగిపోయింది. ఎకరాకు 30 బస్తాల చొప్పున బస్తా ఖరీదు ప్రస్తుతం రూ.350 పలుకుతున్న ప్రస్తుత పరిస్థితిలో 1000 ఎకరాల్లో సుమారు రూ కోటి వరకు నష్టం ఉంటుంది. ఇది కాకుండా ఇంతక్రితమే తీసి ఉంచి నిల్వ ఉంచిన ఉప్పు మరో 3 వేల బస్తాలు అదొక రూ.10 లక్షలకు పైగా రైతుకు నష్టం వాటిల్లింది.

ఉప్పుసాగు చేపట్టేందుకు మరో 15 రోజులు ఆగాల్సిందే..

అకాల వర్షంతో భారీగా నీరు నిలిచిపోయిన ఉప్పుకొఠారులను తిరిగి సాగులోకి తెచ్చుకునేందుకు సుమారు 15 రోజులు పైగా పట్టే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. పంట భూముల్లో ఎకరాలల్లో నిలిచిన నీరును బయటకు పంపించి వాటిని తిరిగి మరళా ఎండగట్టి ఉప్పు పంటను పండించేందుకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని, అందుకోసం తిరిగి భూమిని సిద్ధం చేసేందుకు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందని రైతులు చెప్పారు. ఇప్పటివరకు ఉప్పు కరిగి పోవడంతో ఏర్పడిన నష్టంతో పాటు సాగుకు చేసేందుకు అయ్యే ఖర్చు వెరసి భారీగా రైతు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు ఉప్పు రైతులను ఆదుకోవాలి

ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల సమయంలో ఇతర పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వం ఇతర రైతులను ఆదుకున్న మాదిరిగానే ఉప్పు రైతులను కూడా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. గతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉప్పు రైతులను ఏదో రకంగా ఆదుకున్నారని అదే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఉప్పు రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఒక్క రాత్రిలోనే రూ.లక్షల్లో నష్టపోయాను..



అకాల వర్షం ఒక్క రాత్రిలోనే లక్షల్లో నష్టాన్ని మిగిల్చింది, సుమారు 2000 బస్తాల ఉప్పు ఎక్కాలపై సిద్ధంగా ఉంది. ఆది, సోమవారాల్లో కూలీలను పిలిపించి తీద్దామనుకున్నా. ఈలోగా అకాల వర్షంతో ఉప్పు అంత కరిగి పోయింది. తెల్లారిన తరువాత ఉప్పు కొఠారు వెళ్లి చూసుకుంటే ఉప్పు అంతా కరిగి పోయింది, ఒక్క రాత్రిలోనే సుమారు రూ.ఏడు లక్షలు నీట మునిగిపోయింది.

– గల్లి వెంకటలక్ష్మీనారాయణ

క్లుప్తంగా

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లపై స్పష్టత ఇవ్వాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు కోరారు. కంకర గుంటలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లస్‌టూ స్కూళ్లలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు సర్వీసు నిబంధనల మేరకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉండగా, ఒక ఇంక్రిమెంట్‌తో నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గత జనవరిలో రూ.2500 అలవెన్సుతో ఉపాధ్యాయుల్ని ఉన్నత పాఠశాలల్లో తాత్కాలికంగా సర్దుబాటు చేశారని, 30 శాతం కోటా కింద వెళ్లిన సంబంధిత ఉపాధ్యాయులు ప్రస్తుతం ఉద్యోగోన్నతులు కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌ను మాన్యువల్ విధానంలో నిర్వహిస్తున్న దృష్ట్యా, ఉపాధ్యాయుల నుంచి ముందుగానే ఆప్షన్ తీసుకోవాల్సిన అవసరం లేదని, కౌన్సెలింగ్ సమయంలో నచ్చిన పాఠశాలల్ని వారు కోరుకుంటారన్నారు. బదిలీల విషయంలో న్యాయం జరిగే విధంగా సమగ్రమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అన్ని రకాల ప్రాధాన్యతాక్రమాల్ని పరిగణలోకి తీసుకుని పాయింట్ల కేటాయింపు జరపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగోన్నతులు, బదిలీల విషయంలో ఒకే విధానాన్ని అమలు పర్చాలని విన్నవించారు. సమావేశంలో ఎస్టీయూ గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు గేరా మోహనరావు, డి.పెదబాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

విదేశాలకు నిలిచిన ఎగుమతులు

- కార్మికులను తగ్గిస్తున్న యాజమాన్యం
- బల్లికురవ స్టీల్ గ్రేకు తగ్గిన గిరాకీ
- ఉత్పత్తి తగ్గిస్తున్న క్వారీలు, పరిశ్రమలు



క్వారీలో కదలని రాళ్లు

బల్లికురవ: అంతర్జాతీయ మార్కెట్‌లో స్టీల్ గ్రేకు గిరాకీ తగ్గటం, ఎగుమతులు మందగించటంతో గ్రానైట్ క్వారీలు, పరిశ్రమల్లో రాళ్లు కదలక యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ చుట్టూ సుమారు 30 వరకు గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల్లో లభించే స్టీల్‌గ్రే రాయికి మంచి గిరాకీ ఉండేది. నాలుగు దశాబ్దాలుగా దేశవిదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. కరోనా విపత్తు, దేశ, విదేశాల్లో ఆర్థిక మాంద్యం తలెత్తడంతో క్వారీల్లోని రాళ్లు కదలడటం లేదు. ఇక్కడ క్వారీల్లో గ్యాంగ్‌సా రాళ్లు తైవాన్, చైనా, జపాన్, పోలెండ్, ఇటలీ, టర్కీ వంటి దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ఆరునెలలుగా ఆర్డర్లు లేక రాళ్లు కదటలం లేదు. గతంలో ఒక్కో క్వారీలో నెలకు 1700 నుంచి 2 వేల మీటర్ల రాయి తీసేవారు. ఆర్డర్లు లేక వెయ్యి మీటర్లు మించి తీయడం లేదు.

పరిశ్రమల్లోనూ కదలని రాళ్లు..

ఈ క్వారీలకు అనుబంధంగా బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లో సుమారు 600 పైచిలుకు పరిశ్రమలున్నాయి. ముడిరాళ్లను క్వారీల నుంచి కొనుగోలు చేసి పరుపురాళ్లుగా తయారు చేస్తున్నారు. అధునాతన యంత్రాలతో ఉత్పత్తి పెరిగింది. ఒక్కో పరిశ్రమలో రెండు కటింగ్ మిషన్‌లు ఉంటే నెలకు 30 వేల వరకు పరుపురాళ్లు కట్ చేసేవారు. నేడు అధునాతన మల్టీ కలర్ యంత్రాలతో లక్ష అడుగుల వరకు కట్ చేస్తున్నారు. పరిశ్రమలు పెరిగాయి. గతంలో రాజస్తాన్, బెంగళూరు, మహారాష్ట్ర, చెన్నైలకు అధికంగా ఎగుమతులు జరిగేవి. ఈ పట్టణాల నుంచి వ్యాపారులు రావడం లేదని పరిశ్రమల నిర్వాహకులు సాక్షికి తెలిపారు. ఈ పరిస్థితులకు తోడు క్యూబిక్ మీటర్‌కు రాయల్టీ చెల్లింపును పెంచారని విద్యుత్ చార్జీలు డిజిల్ ధరలు పెరగంటంతో పరిశ్రమలు, క్వారీలు నిర్వహించడం భారంగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



కరోనా విపత్తు అంతర్జాతీయ మార్కెట్‌లో మాంద్యంతో స్టీల్ గ్రేకు ఆరు నెలలుగా గిరాకీ తగ్గింది. ఫలితంగా ఎగుమతులు నిలిచాయి. నష్టాలను తగ్గించుకోనేందుకు ఉత్పత్తి తగ్గించాం. ప్రభుత్వం విద్యుత్ చార్జీల్లో రాయితీ, రాయల్టీ చెల్లింపులో రాయితీని ప్రకటించి ఆదుకోవాలన్నారు. అప్పుడే సంక్షోభంలో ఉన్న గ్రానైట్, క్వారీలు, పరిశ్రమలకు ఊపిరి పోయవచ్చు.

–గుంటక తిరుపతిరెడ్డి, బల్లికురవ, కలర్ గ్రానైట్ క్వారీల సంఘం ప్రధాన కార్యదర్శి

చైనా నుంచి ఎగుమతులు నిలిచాయి..

బల్లికురవ గ్రానైట్ క్వారీల్లో తీసే స్టీల్‌గ్రేకు గిరాకీ తగ్గిన మాట వాస్తవమే. ఇక్కడ నుంచి గతంలో చైనాకు ఎగుమతులు ఎక్కువగా ఉండేవి. చైనా ఎగుమతులు ప్రస్తుతం నిలిచాయి. ఆర్డర్లు వస్తాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. క్వారీల్లో నిబంధనలు భద్రతా చర్యలు పాటిస్తూ పర్మిట్‌తోనే ఎగుమతులు చేయాలి.

– ఏడీ ఆర్.రాజేష్, జిల్లా మైన్స్ ఏడీ

జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లేశ్వరరావు మృతి

మంగళగిరి: జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు (74) గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నగరంలోని పార్కు రోడ్డులో నివాసం ఉంటున్న పుల్లేశ్వరరావు ఆదివారం తెల్లవారుజామున నివాసంలో గుండెపోటుకు గురై ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గంమధ్యలోనే మృతి చెందారు. నగరంలోని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో నేటికీ ఆయన పలువురు పవర్ లిఫ్టర్లకు శిక్షణ ఇస్తున్నారు. పుల్లేశ్వరరావు ఆకస్మిక మృతిపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బాపట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసులను ఆదేశించారు. శని,ఆదివారాలలో రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 96మందిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో డ్రైవ్ కొనసాగించామని చెప్పారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి వారిని అదుపులోకి తీసుకొని కేసులను నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరుస్తామన్నారు. ఈనెల ఒకటి నుంచి ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 695 మందిని అదుపులోకి తీసుకుని వారిపై 685 కేసులు నమోదు చేశామని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ వారిలో వారు గొడవలు పడి హత్యలు, హత్యాయత్నాలకు దారితీసిన ఘటనలు, ప్రజాశాంతికి భంగం వాటిల్లిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి మద్యం సీసాలను ఎక్కడపడితే అక్కడ పడవెయ్యడం, వదిలి వెళ్లడం వల్ల నోరులేని మూగజీవాలకు గాయాలు అవుతున్నాయన్నారు. అంతేకాకుండా పాదచారులకు కూడా చాలా ఇబ్బందికరంగా పరిణమిస్తుందన్నారు. వాటిని కట్టడి చేసి, ప్రజాశాంతికి భంగం వాటిల్లకుండా వుండడానికి నిత్యం నిర్మానుష్యమైన ప్రదేశాలలో, బహిరంగ ప్రదేశాలలో గస్తీలు నిర్వహిస్తూ వుండాలని సూచించామన్నారు. తరచూ వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల నిర్వహించాలన్నారు. దీని వలన రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. మహిళలు, పిల్లలు తిరిగే ప్రదేశాలలో, రోడ్ల పక్కన, చెట్ల క్రింద, వాహనాలలో బహిరంగ ప్రదేశాలలో ఎవరైనా మద్యం సేవిస్తున్న, ప్రజా జీవనానికి భంగం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్న వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్‌లు 100, 112, హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

స్టాండ్ మగ్గాలను నాణ్యతా ప్రమాణాలతో చేయాలి

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



భట్టిప్రోలులో స్టాండ్ మగ్గాలను పరిశీలిస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

భట్టిప్రోలు: క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ పొందిన చేనేత కార్మికులకు అందిస్తున్న స్టాండ్ మగ్గాలను నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయాలని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. శ్రీ మంజునాథ ట్రేడర్స్(ధర్మవరం) ఆధ్వర్యంలో భట్టిప్రోలులో తయారు చేస్తున్న స్టాండ్ మగ్గాల పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ పరిధిలో శిక్షణ పొందిన 250 మందిలో 100 మందికి స్టాండ్ మగ్గాలు, 10 మంది లబ్ధిదారులకు వర్క్ షెడ్‌లు మంజూరయ్యాయి. చిరంజీవి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికులు వస్త్రాలను తయారుచేయాలన్నారు. చేనేత సొసైటీలలో నిల్వ ఉన్న స్టాక్‌ను తీసుకుని వెంటనే పేమెంట్లు చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ వరకు పేమెంట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. నూలు కూడా సబ్సిడీపై ఆప్కో సొసైటీలకు అందిస్తున్నట్లు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో చేనేత కార్మికులు కొత్త డిజైన్లు తీర్చిదిద్దడంలో మెలకువలు పాటించాలని తెలిపారు. తద్వారా చేనేత కార్మికులకు ఆర్థికాభివృద్ధి చేకూరుతుందని అన్నారు. ప్రస్తుతం ఆప్కో షోరూమ్‌లలో చేనేత వస్త్రాలపై భారీ డిస్కౌంట్లు ఇస్తున్నట్లు తెలిపారు. రూ.10 కోట్ల విలువ చేసే స్టాక్ ఉందని వాటిని క్లియర్ చేసేందుకు ఈ డిస్కౌంట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 33, 50, 66 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆప్కో షోరూమ్‌లలో ఈ డిస్కౌంట్ సేల్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. స్టాక్ ఉన్నంతవరకే ఆఫర్లు ఉంటాయని చెప్పారు. అనంతరం ఐలవరం చేనేత వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీని సందర్శించి స్టాక్‌ను పరిశీలించారు. భట్టిప్రోలులోని గంగాపార్వతి సమేత వితలేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, ఐలవరం సొసైటీ అధ్యక్షుడు గట్టు శ్రీనివాసరావు, తిరువీధుల బాలాజి తదితరులు ఉన్నారు.

చేనేతలకు ప్రభుత్వం మరో సబ్సిడీ కానుక

ఎమ్మెల్సీ పోతుల సునీత

వేటపాలెం: చేనేతలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో విద్యుత్ సబ్సిడీ కానుక అందిస్తుందని ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత పేర్కొన్నారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కొణిజేటి చేనేతపురి కాలనీలో చేనేతలకు విద్యుత్ సబ్సిడీపై ఎమ్మెల్సీ అవగాహన సమావేశం ఆదివారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే చేనేతలకు పెట్టుబడి సాయం కింద ప్రతి ఏడాది నేతన్న నేస్తం పేరుతో ఏడాదికి రూ.24 వేలు అందిస్తుందని గుర్తుచేశారు. ప్రస్తుతం మరో కానుకగా మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి నెలకు 100 యూనిట్లు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 9500 మంది చేనేత కార్మికులకు లబ్ధిచేకూరనున్నదని తెలిపారు. చేనేత పరిశ్రమ కూడా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు 100 యూనిట్లు వరకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నారు. అర్హులైన వారు దరఖాస్తులను సమీప విద్యుత్ శాఖ కార్యాలయంలో అందిస్తే పరిశీలన అనంతరం వారికి వచ్చే విద్యుత్ బిల్లులో 100 యూనిట్ల విద్యుత్‌ను సబ్సిడీ ఇస్తారు. ఈ సబ్సిడీ పథకం వలంటర్ ద్వారా కాకుండా కార్పొరేషన్ తరఫున అందించనున్నారు. కావున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పోతుల సురేష్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి.. ఏడుగురిపై కేసు

కొల్లూరు: న్యాయవాదిపై దాడి కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని పెసర్లంకలో ఓ పొలం విషయంలో కొన్నేళ్లుగా వివాదాలు నెలకొనడంతో కోర్టులో కేసులు నడిచాయి. ఇటీవల కోర్టు పొలం సాగు చేసుకునేందుకు సాత సుబ్బారావుకు అనుమతులు ఇచ్చింది. అతను పొలం సాగు చేసుకునే క్రమంలో ఇరువర్గాల నడుమ మళ్లీ గొడవలు జరుగుతుండటంతో కోర్టు సాత సుబ్బారావు తరఫున పొలం కౌలు వేలం నిర్వహించాలని ఆదేశించింది. కోర్టు రిసీవర్ జగదీశ్వరాంబ, కౌలు వేలం నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న సమయంలో ఆమె వెంట వచ్చిన సాత సుబ్బారావుకు చెందిన న్యాయవాది వద్ద ప్రాక్టీస్ చేస్తున్న షేక్ ఖాదర్ హుసేన్‌తో కొందరు గొడవకు దిగారు. పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు నెట్టుకుంటూ వెళ్లి దాడికి యత్నించారు. తనపై జరిగిన దాడిపై లాయరు చేసిన ఫిర్యాదు మేరకు పెసర్లంకకు చెందిన సింగం కృష్ణప్రసాద్, సింగం శ్రీనివాసరావు, గరికపాటి దుర్గప్రసాద్, వెలివల శ్రీనివాసరావు, వెలివల వెంకటేశ్వరరావు, వెలివల వజ్రమ్మ, వెలివల విజయలక్ష్మిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజీవ్ శామ్యూల్‌కుమార్ తెలిపారు.

ప్రియుడితో మనస్పర్ధలు.. యువతి ఆత్మహత్య



రమ్య మృతదేహం

తెనాలి రూరల్: ప్రియుడితో మనస్పర్ధలు కారణంగా యువతి ఆత్మహత్యకు పాల్పడింది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన తురుమెళ్ల రమ్య(22) పలు ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంటుంది. తల్లిదండ్రులకు దూరంగా గత కొద్ది కాలంగా తెనాలిలో ఒంటరిగా నివాసం ఉంటోంది. విజయవాడ, హైదరాబాద్, ఇతర ప్రముఖ నగరాల్లో ఈవెంట్లు చేసుకుంటూ నందుల పేటలోని మూత బావి వద్ద ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. ఈ క్రమంలో పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన సూర్యతేజతో పరిచయం ఏర్పడగా మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఇద్దరి మధ్య తరచూ మనస్పర్ధలు రావడంతో సూర్యతేజ రమ్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రమ్య తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు శనివారం రాత్రి తల్లికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. తిరిగి ఫోన్ చేసినప్పటికీ ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో వారు తెనాలి చేరుకుని చూడగా ఇంట్లోనే రమ్య ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి సంబంధించిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ ఎస్. వెంకట్రావు తెలిపారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని చెప్పారు. తల్లితో ఫోన్ మాట్లాడుతున్న సమయంలోనే రమ్య ఆత్మహత్య పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసినట్లు పేర్కొన్నారు.

హిందూ ధర్మ సంరక్షణకే శంఖారావం

నగరంపాలెం: హిందూ సమాజం, ధర్మం కోసమే శంఖారావం కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి తెలిపారు. హిందూ ధర్మ దీక్షా సేవక్, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ వాసవీ క్లాత్ మార్కెట్ సమీపాన ఉన్న చత్రపతి శివాజీ ప్రాంగణంలో హైందవ ధర్మ శంఖారావం నిర్వహించారు. తొలుత శివపార్వతులకు పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో శంఖారావాన్ని ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల్లోని పలు పీఠాల స్వామీజీలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు వేదికపై ఆశీనులయ్యారు. శివస్వామి మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిల్లో దేవాలయాలు కేంద్రంగా వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ హితం కోసం, శ్రేయస్సు కోసం సందేశాన్ని ఇచ్చేందుకు శంఖారావం చేపట్టామని పేర్కొన్నారు. అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా అన్ని మతాల్ని సమానంగా చూడాలని కోరారు. రానున్న రోజుల్లో లక్ష మందితో శంఖారావం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక ఏపీ అధ్యక్షుడు శ్రీ కృష్ణమాచార్యులు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని రక్షించాలని కోరారు. సేవక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇక్కుర్తి సదాశివరావు మాట్లాడుతూ మతం మారితే కుటుంబానికి, దేశానికి నష్టాలు ఉన్నాయని తెలిపారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆత్మానందస్వామి (తెలంగాణ), రుద్ర యోగేశ్వరానందస్వామి, బెనారస్‌స్వామి, చిదంబరస్వామి, ప్రభులింగాస్వామి (కర్ణాటక), భవానీస్వామి (తమిళనాడు), గజల్ శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, శాసనమండలి విప్ జంగా కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, పాతూరి నాగభూషణం, రంగరాజు పాల్గొన్నారు.

సాగుభూములతోనే జీవన భద్రత

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్

బాపట్ల: పేదల జీవన భద్రతకు ప్రతి కుటుంబానికి సాగుభూములు ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి.కె.ఎం.యూ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలు ఆగస్టులో బాపట్లలో నిర్వహించనున్నామని తెలిపారు. బాపట్ల పట్టణంలోని పూర్ణ ప్యాలెస్‌లో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 90 ఏళ్ల కిందట మన రాష్ట్రంలో క్లిష్టమైన పరిస్థితుల మధ్య జీవనం సాగిస్తున్న గ్రామీణ కష్టజీవుల జీవితాల బాగు కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పండిదన్నారు. అప్పటి నుంచి కష్టజీవులు, శ్రామిక వర్గాలు, పేదలు పక్షాన కమ్యూనిస్టు పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1975లో ప్రత్యక్ష భూ పోరాటాల ఫలితంగా భూ సేకరణ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఆ చట్టాన్ని బుట్టదాఖలు చేయడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందన్నారు. 2005లో మరోసారి ఉద్యమం ఉధృతం చేసి దున్నేవాడిదే భూమి అని ప్రజలతో కలిసి పోరాటాలు చేయడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందని తెలిపారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కోనేరు రంగారావు కమిటీ ఏర్పాటు చేయగా అందులో 144 సిఫార్సులు ఆమోదం తెలిపిందన్నారు. వెంటనే 5 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అద్దంకి నాగేశ్వరరావు, జేబీ శ్రీధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆర్. వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నేత మేడా వెంకట్రావు పాల్గొన్నారు.

హరికథా కళారూపానికే మకుటాయమానం

సచ్చిదానందశాస్త్రి



మాట్లాడుతున్న సచ్చిదానంద శాస్త్రి

అద్దంకి: తనకు దక్కిన పద్మశ్రీ పురస్కారం హరికథా కళారూపానికే మకుటాయమానమని హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి అన్నారు. పట్టణంలోని హరిహర గోకుల క్షేత్రంలో సాహితీ మిత్రమండలి అధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన పద్మశ్రీ కోట సచ్చిదానందశాస్త్రికి పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ తరఫున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి కుటుంబ సభ్యులు ఆయనకు జీవిత సాఫల్య పురస్కారం ఆదివారం అందజేశారు. సచ్చిదానందశాస్త్రి మాట్లాడుతూ తనకు లభించిన పద్మశ్రీ పురస్కారం కళారూపాన్ని పోషించిన వారందరికి దక్కుతుందని పేర్కొన్నారు. పట్టణంలోని సాహితీ సాంస్కృతిక సంఘాల వారంతా సచ్చిదానంద శాస్త్రిని సన్మానించారు. జీవిత సాఫల్య పురస్కారం కింద రూ.21,116 నగదు బహుమతి, పట్టు వస్త్రాలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. సభానంతరం సచ్చిదానంద శాస్త్రిని పుట్టంరాజు కుటుంబ సభ్యులు సాహితీ మిత్రమండలి పక్షాన సన్మానించారు. కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ, కేవీ పోలిరెడ్డి, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకర్‌రావు, నాగసూరి వెంకట సుబ్బారావు, పసుపులేటి ఆంజనేయులు, మిట్టా కామేశ్వర శర్మ, మలాది శ్రీనివాసరావు, ఎండీ రఫీ, నర్రా శ్రీలక్ష్మి, ఊటుకూరి రామకోటేశ్వరరావు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల వార్షిక గ్రాంటు రెట్టింపు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి విద్యా సంవత్సరంలో పాఠశాలల నిర్వహణకు కేటాయిస్తున్న వార్షిక గ్రాంటును రెట్టింపు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవలింగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో పాఠశాలకు గ్రాంట్ రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు రావాల్సి ఉండగా, గత విద్యా సంవత్సరంలో 20 శాతం చొప్పున రెండుసార్లు విడుదల చేశారని తెలిపారు. నిధుల్ని కూడా కొంత మంది హెచ్ఎంలు డ్రా చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని తరగతులకు విద్యుద్దీకరణ చేపట్టి తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లుతో పాటు మినరల్ కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్స్ ఏర్పాటు చేసిన దృష్ట్యా విద్యుత్ బిల్లుల చెల్లింపుకే నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు ఖర్చవుతోందని తెలిపారు. పాఠశాలల నిర్వహణ ఖర్చులు పెరిగిపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం గ్రాంట్స్ రెట్టింపు చేసి విద్యా సంవత్సరం ముందే విడుదల చేయాలని ఆయన కోరారు. విద్యుత్ బిల్లులు చెల్లింపుల్లో ప్రభుత్వ పాఠశాలలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఖాలీద్, మక్కెన శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, కార్యదర్శి టి.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ డి. శివ శంకరరావు, వెంకటేశ్వర్లు, ఎండీ. ఖుద్దూస్ పాల్గొన్నారు.